**కథ**

# తెల్లకార్డు

కారంపూడి వెంకట రామదాస్

**ఆదెమ్మ సూర్యుడి తాపాన్ని తట్టుకుంటూ మండుటెండలో నడిరోడ్డు మీద అడుగులేస్తోంది. ఆరు పదుల వయసులో అవయవాలు ఏం సహకరిస్తాయి? అయినా శక్తినంతా కూడదీసుకుని మరీ నడుస్తోంది.**

''ఏం సర్కారోళ్లో ఏంవో... పాత రేసను కార్డుండగా అది పనికిరాదూ కొత్తది తీసుకోలంటా.. ఈడ ఎవులు తిని తొంగుంటున్నారంటా! ఈ సర్కారోళ్ల చుట్టూ పదిసార్లు తిరగడానికి? పోనీ, పోతే పని సులువుగా అవుతదా? లేదే? ఈళ్ల కాళ్లు ఆళ్ల కాళ్లు పట్టుకోవలసిందే! తమలాంటి పేదోళ్లని ఏడిపించడం తప్పా మరెందుకంటా? ఈ కొత్తకార్డులు'' బయటకే గొణుక్కుంటూ వెళుతోంది ఆదెమ్మ.

''అయ్యా! ఈడ రేసన్‌కార్డులు ఎక్కడిస్తారో కాస్త సెప్పి పున్యం కట్టుకో బాబూ!'' ఇక వెతకటం తన వల్ల కాక అడిగిందో పెద్దాయన్ని.

''ఓ! రేషన్ కార్డులిచ్చే ఆఫీసా? అదిగో అలా కొంచెం ముందుకుపోయి ఎడంవైపు సందులోకి తిరుగు అక్కడే ఆఫీసు!'' ఆదెమ్మ పరిస్థితిని అర్థం చేసుకుని వివరంగా చెప్పాడా పెద్దమనిషి.

''దండాలు బాబూ! యిహ ఎట్టాగో పోతాలే!'' ఆ మాత్రం సహాయానికే కృతజ్ఞతలు చెప్పుకుని కాళ్లీడుస్తూ ముందుకి కదిలింది.

పెద్దమనిషి చెప్పిన ప్రకారం ఆఫీసుని సులువుగానే పట్టుకుంది. కాకపోతే కొండచిలువలా వంకలు తిరుగుతూ బారులుతీరిన 'క్యూ'ని చూసి గతుక్కుమంది ఆదెమ్మ.

వందలాది మంది వచ్చే ఆ ప్రాంతంలో కనీసం నెత్తిన తాటాకు కప్పునైనా వెయ్యాలనే జ్ఞానం లేని జ్ఞానులున్న ఆ ఆఫీసు ఎదుట జనం ఈసురోమని ఎండకి ఎండుతూ నిల్చునున్నారు.

''ఏటిది? ఏడుకొండలోడి దరసనానికా అన్నట్టు ఈ పెజలేంటి? రేసనుకార్డుకేనా ఈ జనం?'' పక్కనే ఉన్న వ్యక్తితో అంది ఆదెమ్మ.

''మరి రేషన్‌కార్డా? మజాకనా? చెప్పులరిగేలా తిరిగి, కాళ్లు వాచేలా లైన్లో కాస్తేగానీ కార్డు దక్కదమ్మ'' అనుభవంతో సెలవిచ్చాడా వ్యక్తి.

''అదేం యిసిత్రమో! పేపర్లలో, టీవీల్లో ఇల్లకాడే కార్డులు జారీ చేస్తమంటారు, తీరా జూస్తే ఇదీ వరస!'' నిట్టూర్చింది ఆదెమ్మ.

''అదే అసలు విషయం! ఇంతకీ నువ్విక్కడికి ఇదే మొదలా రావడం? అయితే ఆఫీసు వెనకాల వేరే కిటికీ ఉంది. అక్కడ నిల్చుని దరఖాస్తు తీసుకో!'' అన్నాడా వ్యక్తి నీ పాట్లుకిది ప్రారంభం మాత్రమే అన్న ఉద్దేశంతో.

''అదేటి? దరకాస్తుని క్యూకాడ నిలబడీ, మళ్లీ కార్డు కోసం క్యూలో నిలబడాల్నా?'' నిరుత్సాహం ఆవహించగా అంది ఆదెమ్మ.

''అది కాదు అవ్వా! ఈరోజు దరఖాస్తు తీసుకుని దాన్ని నింపి వాళ్లకి ఇస్తే వాళ్లు నీకో డేటు ఇస్తారు. ఆ రోజు మళ్లీ రావాలి'' వివరించాడా వ్యక్తి.

ఈ విషయం విని పూర్తిగా నీరుగారిపోయింది ఆదెమ్మ. ఎండ దెబ్బకి యిహ ఏమాత్రం తట్టుకోలేక ఇటు అటు చూసింది.

ఆ ఆఫీసు చుట్టూ తిరునాళ్లకి వెలసినట్టు 'టీ' బడ్డీలూ, పాన్ దుకాణాలు, టిఫిన్ బండీలూ తాత్కాలికంగా వెలిశాయి. జనం అవసరాల్ని తీరుస్తూ జేబులు నింపుకుంటున్నారు చిరు వ్యాపారులు. అక్కడ వారి వ్యాపారం మూడు తెల్లకార్డులూ, ఆరు పింకు కార్డుల్లా వర్ధిల్లుతున్నది.

''బెల్లం సుట్టూ ఈగల్లా, జనం సుట్టూ ఈ ఏపారాలు! 'ఊ!'' అనుకుని బొడ్లో దోపుకున్న డబ్బుల సంచి బయటకి తీసింది ఆదెమ్మ. ఏదో ఒకటి కడుపులో పడకపోతే ప్రాణం దక్కేటట్టు లేదనుకుని మిగిలిన ఒకే ఒక్క పది కాగితం తీసింది. ఆ నోటు ఆమెలానే మడతలు పడి ఉంది. టిఫిన్ చేస్తే పైసలు ఖర్చవుతాయని సోడా తాగితే కనీసం శోషొచ్చి పడకుండా ఉండొచ్చని అనుకుంది.

''యిష్...ష్...'' అంటూ గోళీసోడాని పేల్చి ఇచ్చాడా వ్యాపారి. సోడా తాగిన ఆదెమ్మకి ప్రాణం లేచొచ్చింది. డబ్బులు చెల్లించి దరఖాస్తు కౌంటర్ కేసి కదిలింది. గంటపైనే సూర్యుడు చేసే వడగాయాన్ని తట్టుకుంటూ క్యూలో నిలబడి మొత్తానికి దరఖాస్తునైతే సంపాదించగలిగింది.

★ ★ ★

''ఏమే ఆదెమ్మ! ఉదయం పన్లోకి రాలేదేం?'' అంది కామేశ్వరి మొహం చిట్లిస్తూ.

''ఏం సెప్పమంటారమ్మగోరూ...! రేసనుకార్డుకని సర్కారోళ్ల ఆఫీసుకి పోతిని. ఏదో అరగంటో... గంటో పట్టుదని అనుకున్నా... తీరా అడకిపోతే సాంతాడులా పెద్ద 'క్యూ'... దరకాస్తు దొరికేసరికి టైము ఒకటైంది. ఆ ఎండలో ఇంటికి తిరిగొచ్చేసరికి పానం పోయిందనుకోండి'' తాను పడ్డ అవస్థల్ని వివరించింది ఆదెమ్మ.

''ఊ...ఊ...సరే...ముందు పనూడు!'' అద మాయించింది కామేశ్వరి.

''అమ్మగోరు...ఆ దరకాస్తుని కాస్త నింపిపెడ్తురూ... పున్యముంటది. నాతో సహా ఇంటికాడ అందరూ ఏలిముద్రగాళ్లే. ఆ పనేదో మీరే చేసిపెట్టండి!'' బ్రతిమలాడింది ఆదెమ్మ.

''అలాగేలే! తరువాత దరఖాస్తు తీసుకుని రా!'' అంది కామేశ్వరి.

కామేశ్వరింట్లో పని ముగించిందో లేదో ఇంటికి ఉరుకున పోయి దరఖాస్తు తీసుకుని వచ్చింది ఆదెమ్మ. కామేశ్వరికి ఆమె తొందర చూసి నవ్వొచ్చింది.

''ఏందమ్మగోరు నవ్వుతున్నారు? మీకేం? ఏ కార్డూ లేకపోయినా ఇల్లు ఇట్టే గడిసిపోద్ది. మా బోటోళ్లకే ఆ కార్డు సానా అవసరం! కార్డు నేకపోతే బియ్యం, కిరిసోని ఎట్టా వస్తాయి? పొయ్యిలో పిల్లెలా లొగుస్తుందమ్మా?''

''ఒసే ఆదెమ్మ! కార్డు మాకూ అవసరమేనమ్మా! మేమూ దరఖాస్తు పెట్టుకున్నాం. ఇక నీ సోది ఆపు తల్లీ!'' ఆదెమ్మ కష్టాల అష్టోత్రం వినలేక అంది కామేశ్వరి.

''పేదోళ్ల కష్టాలు సోదే మరి'' మనసులో అనుకుని దరఖాస్తు నింపుకుని మరీ కదిలింది ఆదెమ్మ.

★ ★ ★

''అవ్వా! తెల్లకార్డు కావాలంటే వెయ్యి రూపాయలు ఖర్చవుద్ది!'' కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు రేషన్‌కార్డు ఇష్యూయింగ్ క్లర్క్, ఆదెమ్మ ఇచ్చిన దరఖాస్తు అందుకుంటూ.

''అయ్యో! అంత డబ్బు నాకాడెక్కడిది? ఏదో నేనూ నా బిడ్డలూ కూలీనాలీ జేసుకుంటూ బ్రతుకీడుస్తున్నాం. నీకు పున్యముంటుంది ఎట్టాగైనా తెల్లకార్డు ఇచ్చిపెడ్డూ!'' కాళ్లావేళ్లా పడింది ఆదెమ్మ.

''మీకు చెబితే అర్థం కాదు! ఎట్టాగో అట్టా డబ్బు కట్టు, ఏ కష్టం లేకుండా తెల్లకార్డు తీసుకెళ్లు. సంవత్సరాల తరబడి సబ్సిడీలో బియ్యం, కిరోసిన్ పట్టుకుపోతారు కానీ, కాణీ రాల్చరు. అదే మీతో వచ్చే చిక్కు...''

''అయ్యా! అదేం మాట! సర్కారు మాలాంటోళ్లకేగా ఈ పతకాలన్నీ పెట్టింది! అట్టాంటప్పుడు ఈ డబ్బు దేనికంటా?'' తమ



హక్కుని గుర్తు చేసింది ఆదెమ్మ.

''ఇదో...! రూలు మాట్లాడితే, రూలు ప్రకారమే పనులు జరుగుతాయి. అయినా నీతో నాకేంటి వాదన! సరే, దరఖాస్తు ఇచ్చావుగా. ఏదో రోజు మీ ఇంటికి ఆఫీసర్లు వచ్చి అన్నీ విచారించి వాళ్లే నీకే కార్డు రావాలో అదే ఇస్తారు. ఇక పో!'' అంటూ ఆదెమ్మని కసురుకున్నాడా క్లర్కు.

నిస్సహాయ స్థితిలో అక్కడి నుండి కదిలింది ఆదెమ్మ.

★ ★ ★

ఆదెమ్మ కుటుంబమంతా రేషనుకార్డు ఆఫీసు ముందు 'క్యూ'లో గంటలు తరబడి కాళ్లూ, డొక్కా అన్నీ కాలుతున్నా లెక్కచెయ్యకా ఓపికతో నిలబడి ఫోటోలు దిగే, చేతిముద్రలు సమర్పించుకున్న ఫలితంగా ఆదెమ్మ చేతిలో తళతళ మెరుస్తున్న లేమినేటెడ్ రేషన్‌కార్డు పడింది. కాకపోతే ఆమె చేతికి వచ్చింది 'పింక్ కార్డు'!

ఆ కార్డు చూసి ఆదెమ్మ లబోదిబోమంది.

''అయ్యో! ఇదేం యిసిత్రం! తినడానికి తిండీ కట్టడానికి బట్టా లేని నాకా ఈ 'కార్డు'? ఇదేం అన్యాయం బాబో!'' అంటూ ఆఫీసర్ కేసి పరుగులు తీసింది.

''మా విచారణలో తేలిందేమిటంటే, మీ ఇంట ఉన్న నలుగురి ఆదాయం తెల్లకార్డుని మించి ఉంది. అందుకే ఈ కార్డు!'' సెలవిచ్చాడా ఆఫీసరు.

''అయ్యో! మా సంపాదనేపాటి? నా మొగుడు సంపాదించేది ఆడి తాగుడికే సరిపోదు. ఇక నా కొడుకూ కూతురి అంతంత సంపాదనా ఆళ్ల తిరుగుళ్లకీ సరదాలకే సరిపోదు! మాకేమైనా నెలసరి జీతాలా? ఓ రోజుంటే, ఓ రోజుండని కూలీ బ్రతుకులు! మేమేంటి? మాకీ కార్డేంటి?'' ఆదెమ్మ అరుస్తూనే ఉంది.

''అప్పుడే చెప్పా! డబ్బు కట్టు కార్డు తీసుకెళ్లమనీ... మాట విన్నావా?'' అన్నట్టు చూసాడా క్లర్కు ఆదెమ్మ వైపు.

ఆ చూపుల్ని అర్థం చేసుకున్న ఆదెమ్మ క్లర్కుని పురుగుని చూసినట్టు చూసీ... 'థూ'! అంటూ ఉమ్మింది.

ఆ చర్యకి ఖంగు తిన్నాడా క్లర్కు!

ఇంతలో ఆఫీసు బంట్రోతు-

''ఓ యమ్మో! నువ్వేం చెప్పినా, ఎంత ఏడ్చినా ఫలితం ఉండదు. ఇక పో!'' అంటూ ఆదెమ్మ రెక్క పట్టుకుని బయటకీడ్చేశాడు.

నానా శాపనార్థాలు పెట్టడం మినహా ఏమీ చేయలేని అసహాయురాలైంది ఆదెమ్మ.

చేతిలో కార్డుతో జీవచ్ఛవంలా ఇంటికొస్తున్న ఆదెమ్మని అల్లంత దూరాన్న చూసిన కామేశ్వరి కేకేసింది.

''ఆదెమ్మా! కార్డు దొరికిందా?'' అడిగింది కామేశ్వరి.

ఈ ప్రశ్న పుండుమీద కారం జల్లినట్టైంది ఆదెమ్మకి.

''ఆ! నాలిగ్గీసుకుందుకి కూడా పనికిరాని పింకు కార్డు మొహాన్న కొట్టారు!'' దుఃఖాన్ని దిగమింగుతూ అంది ఆదెమ్మ.

''అయ్యో! ఇదేం చోద్యం?'' జాలిపడింది కామేశ్వరి.

''నా మాట సరే... ఇంతకీ మీకొచ్చిందా కార్డు అమ్మగోరూ?'' ముక్కు చీదుతూ అంది ఆదెమ్మ.

''ఊ.. యిచ్చారే! మాకు తెల్లకార్డొచ్చింది'' మొహమాట పడుతూ మెల్లగా అంది కామేశ్వరి.

''ఆ!'' అని నోరు తెరచి ఉండిపోయింది ఆదెమ్మ.

యజమానులకి తెల్లకార్డులూ, పనోళ్లకి పింకుకార్డులూ... యిదీ మన కార్డుల పంపిణీ తీరు.